లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలి

రైస్‌మిల్లుల యజమానులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి రూరల్, జనవరి 27 : జిల్లాలో మిల్లింగ్‌లో వెనుకబడిన యజమానులు తమ లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కామారెడ్డి డివిజన్ రైస్ మిల్స్ యజమానులతో సీఎంఆర్‌పై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. లక్ష్యాన్ని పూర్తిచేయని మిల్లుల యజమానులకు జరిమానా విధిస్తామని అన్నారు. లక్ష్యం పూర్తిచేయని మిల్లులను సీజ్ చేసి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్, బాబు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ అభిషేక్ సింగ్, రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

గురుకులంలో దరఖాస్తులపై అవగాహన

బాన్సువాడ టౌన్, జనవరి 27 : మైనార్టీ గురుకులంలో 90 శాతం మైనార్టీలకు, 10 శాతం ఇతరులకు ప్రవేశాలకు అవకాశం ఉంటుందని బాన్సువాడ మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ధనలక్ష్మి తెలిపారు. బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఆర్పీలతో దరఖాస్తులపై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలోని మైనార్టీ గురుకులంలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, సరైన అవగాహన లేక చాలా మంది విద్యార్థులు ప్రవేశాలు చేసుకోలేకపోతున్నారని అన్నారు. మున్సిపల్ ఆర్పీలు బాధ్యతగా తమ కాలనీల్లో అర్హులైన విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కోఆప్షన్ సభ్యురాలు తారా, మున్సిపల్ ఆర్పీలు, బాన్సువాడ మైనార్టీ గురుకుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు టీకాలు వేయించాలి

కుక్క పిల్లకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

బాన్సువాడ టౌన్, జనవరి 27 : రేబిస్ వ్యాధి సోకకుండా కుక్కలకు ప్రతి సంవత్సరం టీకాలను వేయించాలని బాన్సువాడ పశు వైద్యాధికారి డాక్టర్ జైపాల్ సింగ్ తెలిపారు. బాన్సువాడలోని పశు వైద్యశాలలో 24 కుక్కలకు శనివారం టీకాలను వేశారు. కార్యక్రమంలో పశు వైద్యుడు రోహిత్ రెడ్డి, ఇతర సిబ్బంది, కుక్కల పెంపకందారులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

బాన్సువాడ టౌన్, జనవరి 27 : పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల బాన్సువాడ సంఘం 2024 డైరీని డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయ వృత్తేనని అన్నారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి సంతోష్, మహిళా అధ్యక్షురాలు మయూరి, సంఘ సభ్యులు ఆనంద్, శంకర్, అనంతరాజు, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

బోర్లం సాంఘిక సంక్షేమ వసతి గృహంలో చల్లటి నీటితో స్నానాలు చేస్తున్న విద్యార్థులు

వణికిస్తున్న చలి.. చన్నీళ్లే గతి!

- బోర్లం సాంఘిక సంక్షేమ వసతి గృహంలో చెడిపోయిన సోలార్ హీటర్
- పట్టించుకోని అధికారులు ఇబ్బందుల్లో విద్యార్థులు
- సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి

బాన్సువాడ రూరల్, జనవరి 27 : కొన్నిరోజులుగా చలి తీవ్రత పెరుగుతున్నది. దీంతో పిల్లల నుంచి వృద్ధుల వరకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చల్లటి నీళ్లతో స్నానం చేయాలంటే ఎవరికైనా ఇబ్బందే. చలి కాలంలో ఎక్కువ మంది ఆరోగ్యరీత్యా వేడి నీళ్లతో స్నానం చేస్తూ ఉంటారు. ముఖ్యంగా పిల్లలు కూడా వేడినీళ్లకే ప్రాధాన్యం ఇస్తారు. బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులు ప్రతిరోజు గజగజ వణికించే చలిలో చన్నీటితో స్నానాలు చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలికితోడు వీస్తున్న చల్లని ఈదురు గాలులు, పొగమంచు కారణంగా ఇప్పటికే కొందరు విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. జలుబు, దగ్గుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. వసతిగృహంలో సోలార్ హీటర్ ఉన్నా.. చెడిపోయిందనే సాకుతో వార్డెన్ నిర్లక్ష్యం వహించడం.. విద్యార్థులకు శాపంగా మారింది. పడిపోతున్న ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న విద్యార్థులు ప్రతిరోజు ఉదయం వణికిస్తున్న చలిలో చల్లటి నీటితో స్నానం చేసేందుకు జంకుతున్నారు. తప్పని పరిస్థితుల్లో చల్లటి నీటితో స్నానం చేస్తున్నారు. వేడి నీళ్ల విషయమై వార్డెన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకుల్లో నిల్వ ఉన్న చల్లటి నీరే తమకు దిక్కంటూ వాపోతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సోలార్ వాటర్ హీటర్‌ను బాగు చేయించాలని విద్యార్థులు వేడుకొంటున్నారు.

జలుబు, దగ్గుతో బాధపడుతున్నాం..

ప్రతిరోజూ చల్లటి నీటితో స్నానం చేయడంతో నాతోపాటు చాలా మంది జలుబు, దగ్గుతో బాధపడుతున్నాం. వేడినీళ్ల కోసం సార్ దృష్టికి తీసుకొచ్చాం. చలికాలంలో చల్లటి నీటితో స్నానం చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. పెద్ద సార్లు చొరవ తీసుకొని వేడినీళ్లు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

-భాస్కర్, వసతిగృహ విద్యార్థి, బోర్లం

సోలార్ హీటర్‌ను బాగు చేయించాలి

కొన్ని రోజులుగా చలి తీవ్రత పెరిగింది. రోజూ చల్లటి నీటితో స్నానం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వసతి గృహంలో ఉన్న సోలార్ హీటర్ చెడిపోయి చాలా రోజులైంది. చలికి తట్టుకోలేక కొంత మంది విద్యార్థులు స్నానం చేయకుండా ఉంటున్నారు. అధికారులు చొరవ తీసుకొని చెడిపోయిన సోలార్ వాటర్ హీటర్‌ను బాగు చేయించి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలి.

-నర్సింగ్, వసతిగృహ విద్యార్థి, బోర్లం

'చరిత్రను క్రమపద్ధతిలో చదివితే వివేకవంతులవుతారు'

భిక్కనూరు, జనవరి 27 : చరిత్రను క్రమ పద్ధతిలో చదివితేనే విద్యార్థులు వివేకవంతులవుతారని ప్రొఫెసర్ లావణ్య బేన్న అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ దక్షిణ ప్రాంగణంలో హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో శనివారం గెస్ట్ లెక్చర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ లావణ్య బేన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చరిత్ర రచన, అధ్యయనంలో వివిధ విషయాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, అధ్యాపకుడు రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రొఫెసర్ లావణ్య బేన్న

ఆరెపల్లిలో వైద్యశిబిరం

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణారెడ్డి

మాచారెడ్డి,జనవరి 27 : పాల్వంచ మండలంలోని ఆరెపల్లి గ్రామంలో డాక్టర్ రాంచంద్రారెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో ఎలాంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారో నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి ఉచిత పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు నర్సింహాచారి, వైద్యశిబిరం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుతో బస్వన్నపల్లి నాయకులు

రాజంపేట్, జనవరి 27 : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావును జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో బస్వన్నపల్లి కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గ్రామంలో తాగునీటి కోసం బోర్లు, వీధి దీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యల గురించి వివరించారు. దీంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని, త్వరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో హన్మంతుగారి శశికాంత్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, అల్లకొండ సంతోష్ రెడ్డి ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నస్రుల్లాబాద్/పిట్లం, జనవరి 27 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు. నస్రుల్లాబాద్ శివారులో బాన్సువాడ-బోధన్ ప్రధాన రహదారిపై వాహనాలను శనివారం తనిఖీ చేశారు. వాహనదారులు ధ్రువపత్రాలను వెంట పెట్టుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీటుబెల్టును ధరించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రఘు, గంగాధర్, నాగ య్య, అంజయ్య పాల్గొన్నారు. పిట్లం-బాన్సువాడ రహదారిపై ఎస్సై విజయ్‌కొండ ఆదేశాల మేరకు పోలీసులు శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వాహనదారులకు వివరించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సేవ చేస్తేనే అధికారులకు గుర్తింపు

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

పెద్ద కొడప్‌గల్, జనవరి 27: అధికారులు.. ప్రజలకు సేవ చేయాలని, అప్పుడే గుర్తింపు ఉంటుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. పెద్దకొడప్‌గల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధికారుల తీరును సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కాస్లాబాద్ చెరువు కట్టకు రూ.9.5లక్షలతో మరమ్మతులు చేశామని ఇరిగేషన్ ఏఈ రహమాన్ తెలుపగా.. ఎంపీటీసీ సాయిలు అసలు పనులే జరుగలేదన్నారు. దీనిపై వివరణ ఇవ్వాలని ఎమ్మెల్యే ఏఈని ఆదేశించారు. ఉపాధ్యాయులు మద్యం తాగి పాఠశాలకు వస్తున్నారని సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎంఈవో దేవీసింగ్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈజీఎస్ పనులపై కూలీలకు అవగాహన కల్పించాలని, పనిచేయని ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని ఎంపీడీవో రాణికి సూచించారు. ప్రజల సమస్యలను తన దృష్టికి తెచ్చిన సభ్యులు, విలేకరులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. హెచ్ఎం కమలతో మాట్లాడారు. సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

హక్కులపై అవగాహన ఉండాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధి రమేశ్‌చంద్

సదాశివనగర్, జనవరి 27: విద్యార్థినులు బాలల హక్కులు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధి రమేశ్ చంద్ అన్నారు. సదాశివనగర్ ఆదర్శ పాఠశాలలో ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఐఎస్ఆర్‌డీ) ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత సామాజిక మాధ్యమాలతో చెడుకు అలవాటు పడుతున్నారని, విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యల్లో ఉన్నప్పుడు 1930 (సైబర్ క్రైమ్), 1098 (చైల్డ్ లైన్), 181 (మహిళా హెల్ప్ లైన్) నంబర్లను వినియోగించుకోవాలన్నారు. లింగ వివక్షను రూపుమాపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐఎస్ఆర్‌డీ జిల్లా నిర్వాహకుడు అమృత రాజేందర్ రావు, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ భానుమతి, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ రావు, ఎంఈవో యోసెఫ్, ఏఎస్సై గంగాసాగర్, ఐకేపీ డీపీఎం రమేశ్ బాబు, ఏపీఎం రాజిరెడ్డి, లీగల్ సెల్ జిల్లా ప్రతినిధులు సాయికృష్ణ, సాయి ప్రణీత్, మానవ అక్రమ రవాణా నిరోధక సిబ్బంది రాజేందర్ కుమార్, సంస్థ ప్రతినిధులు జంగం మహేశ్, ఆర్ల విఠల్, రవళి, సంజీవ్, రమాకాంత్, సాయిశ్రద్ధ, సంతోష్, పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధి

పన్ను వసూలును వేగవంతం చేయాలి

పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీవో అబ్బాగౌడ్

నిజాంసాగర్, జనవరి27: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటి పన్ను వసూలును వేగవంతం చేయాలని ఎంపీవో అబ్బాగౌడ్ అన్నారు. నిజాంసాగర్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అందుబాటులో ఉంటూ మౌలిక వసతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. పన్నులు వసూలైతేనే గ్రామాభివృద్ధి సాధ్యమని తెలిపారు. సమావేశంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

మినుము క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

మద్నూర్, జనవరి 27: మండలంలోని చిన్న ఎక్లారా గ్రామ శివారులో రైతులు సాగుచేస్తున్న మినుము, పొద్దుతిరుగుడు, వేరుశనగ, జొన్న పంటలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అనిల్‌రెడ్డి, రేవంత్, వ్యవసాయాధికారులు కిషన్, రాజు సతీశ్ తదితరులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. మినుములో ప్రధానంగా పూతలో మరుక మచ్చల పురుగు ఉధృతి అధికంగా ఉన్నదని గుర్తించారు. దీని నివారణకు స్పైనోసాడ్ 75ఎంఎల్‌ను నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. బూడిద తెగులు నివారణకు 200గ్రాముల వేట్టాబుల్ సల్ఫర్ లీటరు నీటికి కలిపి ఎకరాకు పిచికారీ చేయాలని తెలిపారు. ఏమైనా సలహాలు, సూచనల కోసం స్థానిక వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. వారితోపాటు రైతులు ఉన్నారు.

పద్మశాలీ కుటుంబాలకు అండగా ఉండాలి

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మశాలీ సంఘం బాధ్యులు

ఎల్లారెడ్డి, జనవరి 27: జిల్లాలోని ప్రతి పద్మశాలీ కుటుంబానికి సంఘం అండగా ఉంటుందని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగాద లక్ష్మీనారాయణ అన్నారు. ఎల్లారెడ్డిలో కొత్తగా నిర్మించిన పద్మశాలీ సంఘ భవనంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సుబ్బాని శ్రీహరి, సంఘం ఎల్లారెడ్డి అధ్యక్షుడు పద్మ దశరథం, నాయకులు గుజ్జరి లక్ష్మీనారాయణ, తాటిచెట్టు శ్రీనివాస్, నాగుల నర్సింహులు, విద్య రవికుమార్, శ్యాంసుందర్, ప్రభులు, పద్మ పండరి, పోశెట్టి, రామకృష్ణ, మోహన్, యాదగిరి, సోమేశ్వర్, పద్మ కాశీరాం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంఘం నూతన భవనం ప్రారంభం..

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 27: మున్సిపల్ నిధులతో కొత్తగా నిర్మించిన పట్టణ పద్మశాలీ సంఘ భవనాన్ని సంఘం అధ్యక్షుడు పద్మ దశరథం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్య సమాజ్ సభ్యుల సహకారంతో యజ్ఞం చేశారు. కార్యక్రమంలో పాండి పెద్దలు షేర్ల ప్రభులు, గూడ రామకృష్ణ, విద్య రవికుమార్, హనుమంతు, దేవసాని పోశెట్టి, రాములు, ఆగమయ్య, విశ్వనాథం, దయానందం, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సోమార్‌పేట్ జీపీ పాలకవర్గానికి సన్మానం

పాలకవర్గాన్ని సన్మానిస్తున్న హనుమాన్ ఆలయ కమిటీ బాధ్యులు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 27: ఐదేండ్ల పాలనను పూర్తిచేసుకున్న సోమార్‌పేట్ పంచాయతీ పాలకవర్గాన్ని హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల ఇందిరా అంజాగౌడ్, ఉపసర్పంచ్ హన్మంత్ రెడ్డి, పాలకవర్గ, ఆలయ కమిటీ సభ్యులు గంజి చిరంజీవి, క్యాస సాయి బాబా, పద్మ కిశోర్, పిట్ల రవీందర్, బాల్‌లింగం, వడ్ల లక్ష్మీనారాయణ, కుసలకంటి సాయిలు, పిట్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ ఆలయ శిఖర ప్రతిష్ఠాపన

పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 27: మండలంలోని శివ్వాపూర్ గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయ శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుడు కులకర్ణి శివకుమార శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. 25 బిందెలతో నీళ్లు తీసుకువచ్చి ఆలయ శుద్ధి నిర్వహించారు. సిందూరపూజ, హోమం, మహాపూర్ణాహుతి, శిఖర ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు జీపీ భవనాలు ప్రారంభం

సదాశివనగర్, జనవరి 27: మండలంలోని మర్కల్, సదాశివనగర్‌లో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాలను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆదివారం ప్రారంభిస్తారని కాంగ్రెస్ జిల్లా నాయకులు బోంబోతుల లింగాగౌడ్, మద్దెల భాగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మర్కల్‌లో సీసీ రోడ్డు పనులు, ఎల్లారెడ్డి మండలంలోని మల్కాపూర్ జీపీ భవనాన్ని కూడా ఎమ్మెల్యే ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సెల్‌ఫోన్ అప్పగింత

సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న రమేశ్

నిజాంసాగర్, జనవరి27: మహ్మద్‌నగర్ మండల కేంద్రానికి చెందిన రమేశ్ రోజు మాదిరిగానే శనివారం కాలువ కట్ట మీదుగా నడుచుకుంటూ పొలానికి వెళ్తున్నాడు. దారిలో రూ.20వేల విలువ ఉన్న సెల్‌ఫోన్ దొరికింది. అచ్చంపేట గ్రామానికి చెందిన రవి ఫోన్ పోగొట్టుకున్నట్లు గుర్తించాడు. దానిని అతడికి అప్పగించడంతో స్థానికులు రమేశ్‌ను అభినందించారు.

అధికారులకు సన్మానం

ఎల్లారెడ్డి, జనవరి 27: జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో నాగిరెడ్డిపేట మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఐకేపీ సీసీ నారాయణ, గిర్దావర్ ప్రసాద్, గాంధారి జీజేసీ ప్రిన్సిపాల్ గంగారామ్‌కు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. దీంతో వారిని ఆయా మండల కేంద్రాల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో సన్మానించారు. కార్యక్రమాల్లో నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో రఘు, నాయకుడు సిద్ధయ్య, అధ్యాపకులు రాజగోపాల్, లక్ష్మణ్, శ్రీధర్, విజయ్‌కుమార్, రమేశ్, వెంకటస్వామి, సరిత, సుజాత, రాజ్‌కుమార్, అంజలి పాల్గొన్నారు.

టీపీఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు

నిజాంసాగర్, జనవరి 27: నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల పంచాయతీ కార్యదర్శులు శనివారం టీపీఎస్ఎఫ్ (తెలంగాణ పంచాయతీరాజ్ సెక్రెటరీ ఫెడరేషన్) సభ్యత్వాన్ని పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు రాజుకు అందజేశారు. కార్యక్రమంలో ఈసీ మెంబర్ రవి, పంచాయతీ కార్యదర్శులు జ్యోతి, శిరీష, సుధారాణి, సునీత, ఫరీదా, సంతోష్, అంజయ్య, శేఖర్, అంబయ్య, పండరి, సాయిప్రణీత్ రెడ్డి, సాయిబాబా, రవీందర్, హరీశ్, శ్రీనివాస్ వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన మైనార్టీ నాయకులు

నిజాంసాగర్, జనవరి27: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ మైనార్టీ నాయకుల సమావేశానికి నిజాంసాగర్ మండలం నుంచి పలువురు తరలివెళ్లారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు రాష్ట్ర నాయకులు హాజరై లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలిపారు. సమావేశానికి తరలిన వారిలో గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్‌అలీ, అహ్మద్ హుస్సేన్, గోరేమియా, ఇఫ్తాకర్ ఉన్నారు.